




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 8 సంచిక : 346

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 29 ఏప్రిల్ 2025


## రాజ్ భవన్ లో తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణస్వీకార కార్యక్రమం..





**హైదరాబాద్,కలంకౌంటర్ :** హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్ ప్రమాణస్వీకారం.

## ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సహకరించండి.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

- ఢిల్లీలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్
- ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించి కీలక అంశాలపై చర్చించిన మంత్రి టి.జి భరత్



**అమరావతి,కలంకౌంటర్ :** ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అగ్రగామి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను స్థాపించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి పూర్తిగా సహకరించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను.. మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. టమోటా పంటను అధికంగా పండిస్తున్న రాయలసీమ జిల్లాల్లో ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద మొదటి విడత రెండవ విడత మొత్త%శీ% రూ. 9.76 కోట్లు విడుదల చేయాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఆరు నెలల్లోపు మొత్తం ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయడానికి మిగిలిన గ్రాంట్ మొత్తం రూ. 34.17 కోట్లు విడుదల చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. రాయలసీమ జిల్లాల్లో రైతులు టమోటా పంటను అత్యధికంగా సాగు చేస్తారని కేంద్ర మంత్రికి వివరించారు. టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్స్ ఏర్పాటుచేయడం ద్వారా పంట కోత తర్వాత నష్టం జరగకుండా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతానికి ఈ కేంద్రాలు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 175 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్.. కేంద్ర మంత్రికి వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేయడం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎంకేఎస్‌వై స్కీమ్స్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలనుకునే వారు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా నేరుగా అప్లై చేసుకునేలా ఏపీకి వెసులుబాటు కల్పించాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఇప్పుడున్న ప్రక్రియ పెట్టుబడుల ప్రతిపాదనలను సకాలంలో సమర్పించడానికి ఒక అడ్డంకిగా ఉందన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడే ఈ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద రూ. 2.67 కోట్ల గ్రాంట్‌తో స్థాపించిన ఇంక్యూబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబందించిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు.

## దేశ భవిష్యత్ యువత చేతిలోనే
## యువతకు అవకాశాలు కల్పిస్తాం... అందిపుచ్చుకోండి

- ఉద్యోగంతోనే సంతృప్తి చెందొద్దు, సంస్థలను స్థాపించే స్థాయికి ఎదగండి
- 2న ప్రధాని చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభం
- ఇక అమరావతి అన్‌స్టాపబుల్
- సీఎం నారా చంద్రబాబు నాయుడు
- విట్ వర్సిటీలో 'వి లాంచ్‌పాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్ పో'లో పాల్గొన్న సీఎం
- క్యాంపస్‌లో పలు భవనాల ప్రారంభం









**అమరావతి,కలంకౌంటర్ :** దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను వారు అందిపుచ్చుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఉద్యోగంతోనే సంతృప్తి చెందకుండా, సంస్థలను స్థాపించే స్థాయికి యువత ఎదగాలని అన్నారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పున:ప్రారంభం కాబోతున్నాయని చెప్పారు. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, క్వాంటమ్ వ్యాలీకి అమరావతి కేరాఫ్ అడ్రస్ కానుందని అన్నారు. విట్ వర్సిటీలో 'వి లాంచ్‌పాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్ పో'లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. క్యాంపస్‌లో మహాత్మాగాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడారు.

**విశ్వనాథన్‌తో నాది ప్రత్యేక అనుబంధం..** విట్ అధినేత విశ్వనాథన్ సాధారణమైన వ్యక్తిగా తన జీవితం ప్రారంభించి అసాధారణమైన వ్యక్తిగా ఎదిగిన తీరు అభినందనీయం. 20 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నారు. ఆ రోజుల్లో పార్లమెంటులో అన్నాదురైతో తర్వాత కరుణానిధి, ఎంజీఆర్, జయలలితతో పనిచేశారు. విశ్వనాథన్ 2014లో ఎన్నికల ఫలితాలు రాకముందే నన్ను కలిశారు. గెలిచిన వెంటనే అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి కోరారు. ఆ రోజు విట్ కోసం విశ్వనాథన్ గారు 200 ఎకరాలు అడిగారు. నేను 100 ఎకరాలు ఇచ్చాను. వారికి కావాల్సిన మరింత భూమి ఇచ్చే బాధ్యత నాది. అయితే... రాబోయే ఏడేళ్లలో 50 వేల మంది స్టూడెంట్స్ విట్‌లో చదివేలా అభివృద్ధి చెందాలి. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్స్ జరుగుతుండటం అభినందనీయం. ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీలో విట్ ఉండటం మనకు గర్వకారణం. విట్ విద్యాసంస్థల్లో మన అమరావతి విట్ నెంబర్‌వన్‌గా ఉండాలని నేను కోరుకుంటున్నాను.

**అమరావతికి తిరుగులేదు :** ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు పున: ప్రారంభమవుతాయి. నేను అందరిలా మాటలు చెప్పను. ప్రజలకు మంచి చేసి చూపిస్తాను. నాపై నమ్మకం పెట్టుకుని 29 వేల మంది రైతులు, 34 వేల ఎకరాల భూమి రాజధానికి ఇచ్చారు. అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని రైతులు ముందుకురావడం అభినందనీయం. 1991లో ఆర్థిక సంస్కరణలకు మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారు. వాటిని నేను అందిపుచ్చుకున్నాను. భవిష్యత్ ఐటీదే అని గ్రహించి దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాను.14 నెలల్లో హైటెక్ సిటీ నిర్మించాం. ఇప్పుడు రాజధాని అమరావతిపై దృష్టి కేంద్రీకరించాం. త్వరలో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయ-ంబోతున్నాం. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ఫౌండేషన్ వేస్తున్నాం. ఒకప్పుడు నేను ఐటీ మాట్లాడితే కొందరికి అర్థం కాలేదు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్ గురించి మాట్లాడితే అది ఏం చేస్తుందంటున్నారు. ప్రతి ఇంట్లో ఎంట్రప్రెన్యూర్ తయారుకావాలి. అమరావతిలో విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీలు అమరావతికి రాబోతున్నాయి. 29 వేల మంది రైతులు, రైతు కూలీలు అమరావతికి సహకరించారు. వారందరినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మాపై ఉంది. వారిలో కొందరిని దత్తత తీసుకోమని విట్ చాన్సలర్ జి. విశ్వనాథన్‌ను నేను కోరాను.

**నాసా నుంచి వాల్ స్ట్రీట్ వరకూ మనోళ్లే:** విద్యార్థులకు చదువు ముఖ్యం. చదువుతోనే విజ్ఞానం వస్తుంది. జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలంటే వినూత్నంగా ఆలోచన

## మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ లో మెరైన్ పోలీస్ స్టేషన్ : హోంమంత్రి వంగలపూడి అనిత

- ఏపీలో శాంతిభద్రతల సమస్యే లేదు
- కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో ఏపీలో నిఘా వ్యవస్థ అప్రమత్తం
- మూడు రాజధానుల పేరుతో గత ఐదేళ్లూ రాక్షస పాలన
- స్థానిక మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- రాజధాని కోసం మహిళా రైతులకు అవమానాలు, బాధలు

- 3లో







# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అర్జీదారులకు అన్నదాన సేవ





**నరసరావుపేట,కలంకౌంటర్ :** పల్నాడు జిల్లా కలెక్టర్ ఆఫీస్ , ఎస్పీ ఆఫీసు నందు జరిగే ( మీకోసం )ప్రజా సమస్యల పరిష్కారవేదికకు సోమవారం జిల్లా నలుముల నుండి అనేక సమస్యలతో సతమతమవుతు వచ్చే వారికి స్థానిక శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు భోజన సదు-పాయం ఏర్పాటు చేయమని తెలుపగా పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో వివిద వర్గాల సహాయంతో నిర్విరామంగ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈవారం కార్యక్రమానికి శికాకొల్లి రాజేష్ ( గుణ రాజేష్ ) చితిరాల అనిల్ కుమారులు సహకరించగా కలెక్టర్ కార్యాలయంలో భోజన కార్యక్రమాన్ని జిల్లా ఫారెస్ట్ అధికారి జి.కృష్ణ ప్రియ ప్రారంభించగా, ఎస్పీ కార్యాలయంలో ఆర్ ఐ కృష్ణ ప్రారంభించి సహకరించిన దాతలను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, తాడువాయి రామకృష్ణ, గౌరు శ్రీనివాసరావు, రెడ్డి మురళి కృష్ణ, వనమా ప్రభాకర్, తాళంకి శివాంజనేయులు, ప్రకాష్, రఘు, శ్రీనివాసరావు,దొగిపర్తి విజయ్,మైలవరపు రాము, అమర్, సురేష్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఐఎన్ఆర్ మార్క్.. అభివృద్ధి స్టార్ట్..



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలో ఐఎన్ఆర్ మార్కు అభివృద్ధికి అధికారులు శ్రీకారం చుట్టారు. రోజురోజుకీ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతున్న దృష్ట్యా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టే విధంగా ముందుకు సాగుతున్నారు. టాపిక్ సమస్యతో పాటు కందుకూరు పట్టణాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా ప్రధానమైన కూడళ్ళను ఎంచుకుని పనులు మొదలు పెట్టారు. తాత్కాలికంగా కొంతమందికి నొప్పబడ్డా.. దీర్ఘకాలంలో వేలాది మందికి ప్రయోజనం కలిగే విధంగా పనులు చేస్తున్నారు. అభివృద్ధికి అడ్డుగా ఉండే కొన్నింటిని అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చి రూల్ ప్రకారం తొలగిస్తున్నారు. ముందుగా పట్టణానికి సింహ భాగమైన నైరుతి వైపు నుండి పట్టణ అభివృద్ధికి కొబ్బరి కాయ కొట్టారు. మాలకొండ పామూరు రోడ్డు జంక్షన్ వద్ద ఏళ్ల తరబడి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఉన్న షాపులను సోమవారం ఉదయం అధికారులు తొలగించారు. దీంతో పట్టణ ప్రజలు, పలు గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.అభివృద్ధి అనేది మాటల్లో కాదు చేతల్లో చూపెట్టాలి అనే తలంపుతో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పని చేస్తున్నారని పలువురు అంటున్నారు. పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరగాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పట్టణ సుందరీకరణకు ప్రజలు అందరూ పూర్తిగా మద్దతు తెలిపి అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఇదే తరహాలో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యను త్వరగా తొలగించాలని కందుకూరు పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

# బిందెలతో మహిళలకు నీళ్లు పట్టించిన మంత్రి, ఎంపీ మరియు ఎమ్మెల్యే



**కందుకూరు,కలంకౌంటర్ :**ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలో వాటర్ పైప్ లైన్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. సమీపంలోని కుళాయి వద్ద కొల్లాయిని ఓపెన్ చేసి మహిళలకు బిందెలతో నీళ్లు పట్టించారు. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, స్థానిక నాయకులు బ్రహ్మానంద రెడ్డి, చేజర్ల వెంకట్రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# దేశ భవిష్యత్ యువత చేతిలోనే

# యువతకు అవకాశాలు కల్పిస్తాం... అందిపుచ్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)



చేయాలి. నాలెడ్జ్ ఎకానమీలో ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ముందుంటే, అందులో తెలుగువారు ట్రెండ్‌సెట్టర్లుగా ఉన్నారు. మన తెలుగువారి జనాభా 5 శాతమే అయినప్పటికీ ఐఐటీల్లో 20 శాతం సీట్లు మనవాళ్లే సాధిస్తున్నారు. సిలికాన్ వ్యాలీ నుంచి స్పేస్ ఎక్స్ వరకు, గూగుల్ నుంచి మైక్రోసాఫ్ట్ వరకు, నాసా నుంచి వాల్ స్ట్రీట్ వరకు అన్ని చోట్ల మన తెలుగువారే సత్తా చాటుతున్నారు. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, ఇంద్రానూయి, అజయ్ బంగా, శాంతను నారాయణ్ వంటి వారు గ్లోబల్ సంస్థల్ని బలోపేతం చేస్తుండటం మనకు గర్వకారణం.

**ఎన్టీఆర్ స్ఫూర్తితో పీ4కు శ్రీకారం..** సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ స్ఫూర్తితో పీ4కు శ్రీకారం చుట్టాం. సమాజంలో ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న 10 శాతం మంది ఆర్థిక ఇబ్బందులతో, పేదరికంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను పైకి తీసుకురావాలి. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం అనే మాట వినపడకూడదు. పౌరుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు చిన్న పనికి కూడా ఎమ్మార్వో ఆఫీస్‌కి వెళ్లాల్సి వచ్చేది. గంటల తరబడి కార్యాలయాల దగ్గర పడిగాపులు పడాల్సి వచ్చేది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,000 సేవలను పెంచుతాం.

**స్వర్ణాంధ్ర కల సాకారం చేస్తాం..** ఏటా 15 శాతం వృద్ధి రేటుతో స్వర్ణాంధ్ర 2047 సాధించాలని నిర్ణయించాం. 2047 నాటికి తలసరి ఆదాయం రూ.55 లక్షలు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 ప్రణాళిక తయారు చేశారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో నిలుస్తుంది. టెర్రరిస్టుల కుట్రలు, కుయుక్తులు మనల్ని ఏం చేయలేవు. మన ఐక్యతను దెబ్బతీయలేవు. రాష్ట్ర స్థాయిలో ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నాం. దీనివల్ల భవిష్యత్‌లో ఏదైనా విపత్తు వస్తే మందులు, ఆహారం డ్రోన్ల ద్వారా పంపవచ్చు.

**విశాఖకు త్వరలో మెట్రో రైల్..** అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. విశాఖకు కొత్త ఎయిర్ పోర్టు, మెట్రోతో పాటు త్వరలో గూగుల్ రాబోతున్నది. ఇప్పటికే విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉంది. అనకాపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీ రూ.లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతోంది. రాయలసీమలోనూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతాం. అనంతపురంలో లేపాక్షి మొదలు ఓర్వకల్లు వరకూ నాలెడ్జ్ హబ్‌గా తయారుచేస్తాం. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. భవిష్యత్ డ్రోన్లదే. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తాం. మోదీ నాయకత్వంలో మేకిన్ ఇండియా కార్యక్రమం కింద 130 బిలియన్ యుఎస్ డాలర్లతో హార్డ్‌వేర్ రంగం అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్‌లో 500 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఉత్పత్తులు తయారుచేసే స్థాయికి మన దేశం చేరుతుంది.

**విట్ విద్యార్థుల ప్రశ్నలు- సీఎం సమాధానాలు..** అమరావతిలో అభివృద్ధి పనులు, రాష్ట్రంలో కొత్త విద్యా సంస్థల ఏర్పాటు, ఐటీ, ఏఐ వినియోగంపై విట్ విద్యార్థులు పలు ప్రశ్నలు అడగ్గా ముఖ్యమంత్రి వాటికి సమాధానం చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడంతో పాటు పేదరికం రూపుమాపడం, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని సీఎం చెప్పారు. ఎన్టీఆర్, అంబేద్కర్, కలామ్ వంటి వారంతా సాధారణ స్థాయి నుంచి వచ్చినవారేనని మహనీయుల స్ఫూర్తితో యువత తాము ఎంచుకున్న మార్గంలో రాణించాలని అన్నారు. రాజకీయాలను తాను సేవా మార్గంలోనే చూశానని అన్నారు. రాత్రికి రాత్రే జాక్ పాట్ కొట్టేయాలనుకోవడం అత్యాశే అవుతుంది. జీవితంలో కష్టపడి అంచెలంచెలుగా ఎదిగిన వారికి తిరుగుండదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# బందర్ పోర్ట్, ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల పరిశీలించిన రాష్ట్ర మంత్రులు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం పోర్ట్, గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత శాఖాధికారులు మంత్రులకు వివరించారు. 2026 మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మచిలీపట్నం వాసుల చిరకాల వాంఛ పోర్టు అని దాని నిర్మాణం సకాలంలో పూర్తిచేసి మచిలీపట్నం వాసులకు అంకితం చేస్తామని ఇప్పటికి 30% పైగా నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో మే 2వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి వస్తున్న సందర్భంగా, జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ప్రధాని సభకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రతి నియోజకవర్గంలో నుండి ప్రజలు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునే విధంగా రాజధాని నిర్మించబోతున్నామని అన్నారు. అమరావతి రాజధాని పుణ్య నిర్మాణంలో మేము కూడా భాగస్వాములు అవుతామంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు.

# వేస్ట్ మేనేజ్ మెంట్ కు మున్సిపల్ శాఖ అధిక ప్రాధాన్యత

- బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేసే అలవాటు వదిలివేయాలి
- రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ





**విజయవాడ,కలంకౌంటర్ :** వేస్ట్ మేనేజ్ మెంట్ కు పంచాయితీ, పురపాలక సంఘాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్,బిహేవియరల్ చేంజ్ పై సోమవారం ఒక రోజు వర్క్ షాప్ విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్ షాప్ నకు హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతిరోజూ 6500 టన్నుల సాలిడ్ వేస్ట్ వస్తుందన్నారు. గత ప్రభుత్వం 80లక్షల టన్నుల చెత్తను వదిలివెళ్లిందని, సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ ఏడాది అక్టోబర్ 2 లోపు చెత్తనంతా తొలగించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్,లిక్విడ్ వేస్ట్ తొలగించడం ఎంతో సవాల్ తో కూడుకున్నదని, అయితే ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు చెత్తను తొలగించడానికి తీసుకుంటున్న ఉత్తమ నిర్ణయాలను క్రోడీకరించి మన రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఏరోజుకారోజు ఈ చెత్తనంతా తొలగించాలన్న దృక్పథంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. నాలుగు థీమ్ లు గా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని, వాటిని క్రమబద్ధంగా అమలు చేసి దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలను ఏ మేరకు సమర్థవంతంగా అమలు చేశామన్నది అన్నింటికన్నా ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండ అవగాహన కలిగిఉండాలన్నారు. అలాగే చెత్త పట్ల ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించడం, రీసైక్లింగ్ పై చైతన్యం కలిగించే అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టనున్నామని తెలిపారు. వాటిల్లో భాగంగానే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నారని, దీంతో ప్రజల్లో చెత్త నిర్వహణపై అవగాహన పెరిగిందన్నారు. ప్రజలకు అవగాహన ఎలా కల్పించాలి? ఎలాంటి ప్రచారం నిర్వహించాలి అనే దానిపై రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛత యొక్క ప్రాధాన్యత తెలిసేలా రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు.

**స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడి పట్టాభి మాట్లాడుతూ..** వేస్ట్ మేనేజ్ మెంట్ లో మన రాష్ట్రం అగ్రగామిగా నిలవాలంటే రాష్ట్రం లో ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఇక్కడకి వచ్చిన స్టేక్ హోల్డర్స్ అంతా ఎంతో అనుభవజ్ఞులని వారి సలహాలు, సూచనలు స్వీకరించి స్వచ్ఛత విషయంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ప్రణాళికలు రూపొందిస్తామని పట్టాభి రామ్ అన్నారు. అలాగే గత నెల యూరోప్ పర్యటన సందర్భంగా 8 కంట్రీస్ లో ముఖ్యంగా గమనించింది, వారి జీవన శైలిలో స్వచ్ఛతపై ప్రజల్లో ఉన్న అవగాహన అమోఘమన్నారు. అక్కడి ప్రజలు సైతం ప్లాస్టిక్ బిన్ లో ప్లాస్టిక్, పేపర్ బిన్ లో పేపర్ ఇలా వాటికి కేటాయించి బిన్లలో వాటినే వేస్తున్నారని తెలిపారు. అలాగే మన రాష్ట్రంలో కూడా రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా ఎవరికి వారు స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. మనం తీసుకునే ప్రక్రియ ఏదైనా టార్గెటెడ్ గా ఉంటే ఫలితాలు కూడా త్వరగా వస్తాయని అందులో విద్యార్థులు,మహిళలు, ఉద్యోగులు వారికి తగిన కంటెంట్ ప్రణాళిక బద్ధంగా తయారు చేసి ఇస్తే ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉందని తెలిపారు. మహిళలకు మరింత చేయుతనిస్తూ వారికి అవగాహన కల్పిస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలమన్నారు. విదేశాల్లో పిల్లలకి చిన్నప్పటి నుంచే ఎడ్యుకేషన్ లో స్వచ్ఛత పైన పాఠ్యాంశాలు ఉన్నాయని అలాగే రాష్ట్రం లో కూడా మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ అలాగే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కూడా చిన్నారుల పాఠ్య పుస్తకాలలో స్వచ్ఛత గురించి పొందు పరచినట్లయితే విద్యార్థులకు చిన్నతనం నుండే స్వచ్ఛతపై బాధ్యత పెరుగుతుందని పట్టాభి రామ్ అన్నారు.

**ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ మాట్లాడుతూ..** విదేశాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. మన దేశంలో కూడా శాశ్వతంగా స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వడంలో ప్రజలు తమ కల్చర్ లో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో మన రాష్ట్రం గతేడాది 6 స్థానం లో ఉందని, ఈ ఏడాది మన రాష్ట్రం ర్యాంక్ మరింత మెరుగుపరుచుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ ను డ్రైయినల్లలో వేయరాదని, అలా చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అనంతరం మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి డైరక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి. అనిల్ కుమార్ లు ఐఈసీ పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్జీవో సంస్థలు, స్టేక్ హోల్డర్స్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్, పంచాయితీ, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 30 నుండి అమ్మవారి వార్షిక తిరుణాల




**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగలముఖి -బండ్లమ్మ అమ్మవారి వార్షిక తిరుణాల మహోత్సవములు ఈ నెల 30 నుండి మే 5 వరకు అత్యంత వైభవపేతముగా జరపటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లుగాను ఈ ఉత్సవాలలో చందోలు, కుంచెలవారిపాలెం, తూర్పు పాలెం, భవనంవారిపాలెం, చోడిపాలెం, సంగుపాలెము మరియు కోడూరు గ్రామముల నుండి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుట జరుగును ఆయా గ్రామాల భక్తుల స్వాగతములతో అమ్మవారు పావనము ఘటము రూపంలో ఆ గ్రామాల లో ఊరేగింపుగా పసుపుకుంకుమలు సద్ది నివేదనలు స్వీకరించబడును .మే3తారీకు అమ్మవారి ప్రాచీన బంగారుఆభరణములు బ్యాంకు నుండి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అలంకరింపబడునని ఆదివారము మొక్కుబడులు, సద్ది నివేదనలు జరుగునని ఐదో తారీకు సోమవారం బగలముఖి జయంతి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని ప్రతిరోజు విశిష్ట పూజా కార్యక్రమాలు విశేష అలంకరణలు జరుగునని భక్తులు ఎండాకాలము దృష్టిలో పెట్టుకొని అమ్మవారి దర్శనానికి విచ్చేయవలసిందిగా ఆలయ కార్య నిర్వహణ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# డి సి సి బి చైర్మన్ లు జాబితా

**అమరావతి,కలంకౌంటర్ :** 10 జిల్లాలకు డీసీసీబీ ఛైర్మన్లను ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం డీసీసీబీ ఛైర్మన్? గా శివ్వల సూర్యనారాయణ(టీడీపీ) విశాఖ డీసీసీబీ ఛైర్మన్?గా కోన తాతారావు(జనసేన) విజయనగరం డీసీసీబీ ఛైర్మన్?గా కిమిడి నాగార్జున(టీడీపీ) గుంటూరు డీసీసీబీ ఛైర్మన్?గా మాకినేని మల్లికార్జునరావు(టీడీపీ)కృష్ణా డీసీసీబీ ఛైర్మన్?గా నెట్టెం రఘురామ్(టీడీపీ) నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్?గా ధనుంజయరెడ్డి(టీడీపీ) చిత్తూరు డీసీసీబీ ఛైర్మన్?గా అమాస రాజశేఖర్ రెడ్డి(టీడీపీ) అనంతపురం డీసీసీబీ ఛైర్మన్?గా కేశవరెడ్డి(టీడీపీ) కర్నూలు డీసీసీబీ ఛైర్మన్?గా డి.విష్ణువర్ధన్ రెడ్డి(టీడీపీ) కడప డీసీసీబీ ఛైర్మన్?గా బి.సూర్యనారాయణరెడ్డి(టీడీపీ)

# కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ గా నెట్టెం రఘురామ్



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ గా మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ ను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో పలు జిల్లాల కేంద్ర సహకార బ్యాంక్ లకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షునిగా ఉన్న రఘురామ్ ను జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ గా నియమించారు. మూడు సార్లు జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు.

కలంకౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
కలంకౌంటర్ దినపత్రిక లో యాడ్స్ కోసం సంప్రదించండి..
సెల్ : 9346935672

# ఎల్.హెచ్.ఎం.ఎస్. సౌకర్యాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లాలోని విజయనగరం 1వ పట్టణ, 2వ పట్టణ, విజయనగరం రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలోని మున్సిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వేసవి సెలవులు సందర్భంగా తమ స్వంత ప్రాంతాలకు వెళ్ళే సమయాల్లో తమ ఇండ్లలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎల్.హెచ్.ఎం.ఎస్. (లాక్డ్ హౌస్ మోనటరింగు సిస్టం) సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కోరారు. దొంగతనాల నియంత్రణకు రాష్ట్ర పోలీసుశాఖ లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టం (ఎల్.హెచ్.ఎం.ఎస్)ను ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ఈ విధానం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన ఇల్లు విడిచిపెట్టి బయట ప్రాంతాలకు వెళ్ళే సమయాల్లోనే ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఈ మొబైల్ యాప్ సేవలు విజయనగరం వన్ టౌన్, టూ టౌన్, రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలోని కార్పొరేషను, మున్సిపల్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి అందుబాటులో ఉందన్నారు. ఈ ఎల్.హెచ్.ఎం.ఎస్. మొబైల్ యాప్ వినియోగం వలన ప్రజల ఆస్తుల రక్షణకు కవచంలా పని చేస్తుంద న్నారు. ఈ పోలీసు స్టేషను పరిధిలోని ప్రజలెవరైనా తాము ఇల్లు విడిచి తమ స్వంత అవసరాలు లేదా పనులు లేదా ఉద్యోగరీత్యా లేదా పండగలకు లేదా ఏదైన ఇతర కారణాల వలన బయట ప్రాంతాలకు వెళ్తున్నట్లుగా సంబంధిత పోలీసు స్టేషనుకు ముందస్తు సమాచారాన్ని అందించినట్లయితే పోలీసులు ఎల్.హెచ్.ఎం.ఎస్. సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారన్నారు. ఇందుకుగాను వారు తమ స్మార్ట్ ఫోనులో గూగుల్ ప్లే స్టోర్ నుండి ఎల్.హెచ్.ఎం.ఎస్. యాప్ ను డౌన్లోడు చేసుకొని, ఇంటి నుండే తమ పేరు, ఫోను నంబరు, లొకేషను వంటి ఇతర వివరాలను, ఎల్.హెచ్.ఎం.ఎస్.సేవలను ఎప్పటి నుండి ఎప్పటి వరకు పొందాలన్న విషయాలను యాప్ లో నమోదు చేసి, రిక్వెస్ట్ పంపాలన్నారు. రిక్వెస్ట్ పంపిన తరువాత వారి మొబైల్ నంబరుకు ఒక రిజిస్ట్రేషను నంబరు వస్తుందని, ఈ నంబరునే యూజర్ ఐడిగా పొందవచ్చునన్నారు. ఇలా రిక్వెస్ పంపిన తరువాత సంబంధిత పోలీసు స్టేషను నుండి పోలీసులు సదరు ఇంటిని సందర్శించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ఆయా ఇండ్లపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. నిఘా కొరకు ఏర్పాటు చేసిన సిసి కెమెరాలతో ఈ యాప్ ను అనుసంధానం చేయడం వలన దొంగతనంలు జరగకుండా నియంత్రించవచ్చునన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇంటి పరిసరాలలోకి ప్రవేశించిన వెంటనే పోలీసు కంట్రోల్ రూంకు సమాచారం చేరవేస్తూ, అలారం మ్రోగుతుందన్నారు. దీనితో పోలీసులు అప్రమత్తమై, సంబంధిత పోలీసు స్టేషనుకు సమాచారం అందించి, దొంగతనాలు జరగకుండా సులువుగా నియంత్రించడంతోపాటు, నిందితులను కూడా రెడ్ హ్యాండడ్ గా పట్టుకోవచ్చునన్నారు. విజయనగరం వన్ టౌన్, టూ టౌన్, రూరల్, బొబ్బిలి, నెల్లిమర్ల పోలీసు స్టేషను పరిధిలోని కార్పొరేషను, మున్సిపల్ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎల్.హెచ్.ఎం.ఎస్. సేవలను సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎప్పుడు ఇతర ప్రాంతాలకు వెళ్ళాలన్నా ఎల్.హెచ్.ఎం.ఎస్. సౌకర్యాన్ని ఉచితంగా వినియోగించుకోవాలని, దొంగతనాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని ప్రజలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కోరారు.

# మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ లో మెరైన్ పోలీస్ స్టేషన్ : హోంమంత్రి వంగలపూడి అనిత

● ఏపీలో శాంతిభద్రతల సమస్యే లేదు ● కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో ఏపీలో నిఘా వ్యవస్థ అప్రమత్తం ● మూడు రాజధానుల పేరుతో గత ఐదేళ్లూ రాక్షస పాలన ● స్థానిక మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం ● రాజధాని కోసం మహిళా రైతులకు అవమానాలు, బాధలు







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్‌లో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. అసంపూర్తిగా ఉన్న మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ పనులు చకచకా సాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 21 మెరైన్ పోలీస్ స్టేషన్‌లు ఉన్నట్లు హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఒక్క కృష్ణా జిల్లాలోనే 3 మెరైన్ పీఎస్ లు ఉన్నాయన్నారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేలా ఫిషింగ్ హార్బర్‌లో రక్షణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఫిషింగ్ హార్బర్ అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. ఫిషింగ్ హార్బర్ లో బోట్లు నడవని పరిస్థితి దుస్థితి ఎన్డీయే ప్రభుత్వం వచ్చే దాకా ఉందన్నారు. మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీకి కావల్సిన బోట్ల వంటి సదుపాయాలు సమకూర్చడంపై దృష్టి పెడతామన్నారు. నిరుద్యోగ మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హోంమంత్రి తెలిపారు. పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా తర్ఫీదునిచ్చి గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. విపత్తునిర్వహణ సంస్థ ద్వారా శిక్షణనిచ్చి ఆపదమిత్రలుగా నియమిస్తామన్నారు. రక్షణలో భాగమైన మెరైన్ పోలీస్ స్టేషన్, ఔట్ పోలీస్ స్టేషన్ ల సామర్థ్యం పెంచుతామన్నారు. కశ్మీర్ లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ఏపీలో నిఘా వ్యవస్థను అప్రమత్తం చేశామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను ఏపీలోనూ గట్టిగా అమలు చేస్తున్నామని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. భద్రతకు లోటు లేకుండా పటిష్ఠ తనిఖీలు నిర్వహించి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 21 మంది పాకిస్తాన్ దేశస్తులు మంగళవారంలోగా భారతదేశం విడిచి వెళ్లాలన్న కేంద్రం ఆదేశాలిచ్చామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతోందని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు రాజధాని ఏర్పాటు కలను సాకారం చేస్తామన్నారు. మూడు రాజధానుల పేరుతో గత ఐదేళ్లూ రాక్షస పాలన సాగిందని విమర్శించారు. అమరావతి రాజధాని కోసం మహిళా రైతులు అవమానాలు, బాధలు పడ్డారని ఆమె ప్రస్తావించారు. బూటుకాలుతో తన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గకుండా రైతులంతా ఏకమై పోరాడి గెలిచారన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం చేసుకునే స్వేచ్ఛలేకుండా గత ప్రభుత్వం కక్షగట్టి నానా ఇబ్బందులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోడి నేతృత్వంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో అమరావతి నిర్మాణం తిరిగి పురుడుపోసుకోవడం రాష్ట్ర ప్రజలకు పండుగలాంటిదన్నారు. ప్రధాని మోదీ సభకు తరలివచ్చే ప్రజలకు ఇబ్బందులు రాకుండా భద్రతా ఏర్పాట్లపై మచిలీపట్నం కలెక్టరేట్‌లో సహచర మంత్రులతో కలిసి హోంమంత్రి సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షకు , అంతకుముందు జరిగిన ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలనకు మంత్రులు బీసీ జనార్థన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ బాలాజీ, కృష్ణాజిల్లాకు చెందిన శాసనసభ్యులు, జిల్లా అధికార యంత్రాంగం హాజరయ్యారు.

# సబ్ స్టేషన్ కు శంకుస్థాపన, అభివృద్ధి ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి





**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలంలోని మన్నేటి కొట్టే పంచాయతీలో సోమవారం 33/11 కెవి నూతన సబ్ స్టేషన్ కు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. దీనితోపాటు త్వరలోనే మూడు సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన చేస్తామని అన్నారు. మండలంలోని బద్దిపూడి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సీసీ రోడ్డు, తాగునీటి పైపులైను వీరి చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన త్రాగునీటికి, సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని అన్నారు. విధ్వంసకర పాలన పోయి, సంక్షేమం అభివృద్ధి పాలన మొదలైందని మంత్రి అన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యంగా కోటిమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉలవపాడు మండలంలో రైతులకు విద్యుత్ సరఫరా లో ఓల్టేజీ సమస్యలు రాకుండా సబ్ స్టేషన్ లో నిర్మిస్తున్నామని అన్నారు. ఈ సబ్ స్టేషన్ వల్ల ఎంతో ఉపయోగమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, తెలుగుదేశం బిజెపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ







**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

# నిడదవోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మే 3న జాబ్ మేళా


● పాల్గొననున్న 45 కంపెనీలు ● 1302 మందికి ఉద్యోగాల కల్పన
రూ.12,000 నుండి రూ.40,000 వరకు జీతం పొందే సువర్ణావకాశం ● నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు




**నిడదవోలు/అమరావతి, కలంకౌంటర్ :** నిడదవోలు నియోజకవర్గ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించడం కోసం మే 3వ తేదీన ఎస్ వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో భాగంగా 1302 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. తద్వారా రూ.12,000 నుండి రూ.40,000 వరకు జీతం పొందవచ్చన్నారు. జాబ్ మేళాకు ఇసూజూ, ఎల్ అండ్ టీ కన్ స్ట్రక్షన్, జీఎంఆర్ కార్గో, పానాసోనిక్,హెచ్ డీబీ ఫినాన్షియల్ సర్వీసెస్, అపోలో ఫార్మసీ, ఐసోన్ ఎక్స్ పీరియన్సెస్, స్మార్ట్ బ్రెయిన్స్, సాండ్ స్పేస్ టెక్నాలజీస్, డీలేట్ కర్ కార్పొరేట్, సదర్ ల్యాండ్, సినర్జీన్, ఈఎస్ఏఎఫ్, స్పందన, ముత్తూట్ ఫైనాన్స్, పైసా బజార్, రీసొల్యూట్, ఇండస్, ఎంసీవీ, ఇండో ఎంఐఎం, పిల్కింగ్టన్,ఇన్ ఫిలూమ్, హెచ్ డీఎఫ్ సీ, బీఎస్ సీపీఎల్, జీఎల్ఆర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తదితర 45 కంపెనీల ప్రతినిధులు రానున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పాసై మంచి అవకాశం కోసం ఎదు-రుచూస్తున్న యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 35 ఏళ్లలోపు ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడెటా, విద్యార్హత, సర్టిఫికెట్లతో మే3వ తేదీన ఉదయం 9 గంటల నుండి నిర్వహించే జాబ్ మేళాకు హాజరుకావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.

# జనసేన నేత 'ఆర్కే'కు కీలక పదవి

● జిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ గా నియామకం
● నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఆర్కేని వరించిన డీసీఎంఎస్ ఛైర్మన్ పదవి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ బండి రామకృష్ణ (ఆర్కే)కు కీలక పదవి లభించింది. పొత్తులో భాగంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ను త్యాగం చేసిన బండి రామకృష్ణను కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రామకృష్ణ నియామకం పట్ల జనసైనికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మచిలీపట్నంకు చెందిన రామకృష్ణ చిన్నప్పటి నుండి స్వయం కృషితో ఉన్నత స్థానానికి చేరుకున్నారు. వ్యాపార వం-గంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పర్చుకున్న రామకృష్ణ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి 2019లో జనసేన పార్టీలో చేరారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మచిలీపట్నం నుండి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తొలిసారి పోటీ చేసి ఓడిపోయినా 18వేల ఓట్లను సాధించారు. పార్టీలోకి వచ్చిన రోజు నుండి పార్టీ కార్యకలాపాల్లో విస్తృతంగా పాల్గొంటూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేశారు. 2023 మార్చి నెలలో మచిలీపట్నంలో జరిగిన జనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభను విజయవంతంలో రామకృష్ణ ప్రత్యేక పాత్రను పోషించారు. ఆ సభ విజయవంతంతో పవన్ కళ్యాణ్ కు ఆయన మరింత దగ్గరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వారాహి యాత్రలో ఫుడ్ కమిటీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. 2024 ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా మచిలీపట్నం అసెంబ్లీ టికెట్ ను ఆయన త్యాగం చేశారు. కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన కొల్లు రవీంద్ర విజయంలో కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతున్నా రామకృష్ణకు సముచిత స్థానం దక్కలేదని జనసైనికులు తీవ్ర నిరాశలో ఉన్న సమయంలో ఆయన్ని జిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ గా నియమించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



భారతీయ జనతా పార్టీ సంస్థ గత ఎన్నికల్లో భాగంగా మచిలీపట్నం రెండవ మండలం అధ్యక్షునిగా మాదిరెడ్డి వెంకట సతీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్ర రావు శ్రీనివాస రాజు కబర్ది పుప్పాల రాము తదితరులు అభినందనలు తెలిపారు.
-మచిలీపట్నం,కలంకౌంటర్ :

# జనసేన సేవకుడికి గుర్తింపు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన మచిలీపట్నం జనసేన పార్టీ రథసారథి బండి రామకృష్ణ కి హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్ జనసేన పార్టీ నాయకులు దేవనూరు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంపు విద్యార్థులకు వినూత్నమైన అవకాశాలను అందిస్తుంది

**- నగర కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు**







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ ఈడేపల్లి శాఖ గ్రంథాలయమునందు గ్రంథాలయ నిర్వాహకురాలు, కోన వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ క్యాంపు సోమవారం మున్సిపల్ కమిషనర్, సిహెచ్ వివిఎస్ బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ లు సోమవారం ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు మాట్లాడుతూ సమ్మర్ కోచింగ్ క్యాంపు విద్యార్థులకు వినూత్నమైన అవకాశాలను అందిస్తుంది అన్నారు. సమ్మర్ కోచింగ్ క్యాంపు ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. సమ్మర్ కోచింగ్ క్యాంపు విద్యార్థుల భవిష్యత్తుకు మెరుగైన దారి తీసే అరుదైన అవకాశం గా నిలుస్తుందని, ఇలాంటి క్యాంపులను విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి పిల్లలను సమ్మర్ కోచింగ్ క్యాంపులకు పంపాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 45వ డివిజన్ ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో విద్యార్థిని విద్యార్థులకు వివిధ రూపాలలో సమ్మర్ కోచింగ్ ఇవ్వడం జరుగుతోందని, అలాగే సమ్మర్ కోచింగ్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు కూడా గ్రంథాలయం నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ దాతల సహకారంతో అందజేయడం జరుగు తోంది అన్నారు. ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ఈరోజు నుండి 40 రోజులపాటు జరిగే సమ్మర్ కోచింగ్ ను విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈడేపల్లి శాఖ గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకునే దిశలో ఉన్నందున మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమావేశం అనంతరం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ లను డివిజన్ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, ఈడేపల్లి శాఖ గ్రంథాలయ నిర్వహణకురాలు, కోన వెంకటేశ్వరమ్మ, డివిజన్ పెద్దలు, ఆర్ వి ఎస్ మురళీధర్, డాక్టర్ బొల్లాప్రసాద్, లక్ష్మీనారాయణ, కాళీపట్న పు రఘు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బోడపాడులో శ్రీ గంగానమ్మ తిరునాళ్ల మహోత్సవాలు ప్రారంభం





**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** రూరల్ మండలం నున్న పంచాయతీ పరిధి బోడపాడులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ నేతృత్వంలో నిర్మించిన సమరసత శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానం తిరునాళ్ల మహోత్సవాలు సోమవారంర ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ మహాలక్ష్మి, మహా సరస్వతి, మహాకాళి స్వరూపిణి అయిన శ్రీ గంగానమ్మ అమ్మవారు బోడపాడులో స్వయంభుగా వెలిశారు. దీంతో ఏటా మూడు రోజులపాటు తిరునాళ్ల మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే తొలి రోజైన సోమవారం ఉదయం అమ్మవారి సుప్రభాతం, ఆలయశుద్ధి, నిత్యార్చన, గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపారాధన, కలశస్థాపన, అంకురార్పణ పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలతో మాను పూజ, పసుపు కుంకుమ సమర్పణ అనంతరం శ్రీ గంగానమ్మ అమ్మవారు ఆలయ ప్రవేశం చేశారు. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా తొలి రోజున ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల్ స్వామి నేతృత్వంలో అష్టోత్తర శత కలశాభిషేకం (108 కలశాలతో) పంచామృత అభిషేకం, అలంకరణ తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాలార్చన, సహస్రనామార్చన, చతుర్వేదపారాయణ, పంచహారతులు, తీర్థప్రసాద వినియోగం, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

# ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలి...

**● స్వర్గీయ పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణ కమిటీ కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కు వినతి**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి మచిలీపట్నం నగర కార్పొరేషన్ నందు ఎజెండా అంశము లో పెట్టమని హైకోర్టు వారు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని సోమవారం కలెక్టరేట్ లో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కు పట్టాభి స్మారక భవనం నిర్మాణ కమిటీ కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్, సభ్యులు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సురిశెట్టి హరికృష్ణ లు హైకోర్టు వారి ఉత్తర్వులతో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుమీద ప్రజలకు ఉపయోగపడే విధంగా మెమోరియల్, మ్యూజియం, లైబ్రరీ కట్టుకోవడానికి ఆర్ఎస్ నెంబర్ 371/1 ఏలో రెండు ఎకరాలు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు, వల్లభనేని బాలసౌరి అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలియజేయగా సదరు అప్పటి ముఖ్యమంత్రి ఉత్తర్వుల మేరకు చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విజయవాడ వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారని అన్నారు.

# ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వినతి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం సర్వ జన ఆసుపత్రి లో 70 స్టాఫ్ నర్సు పోస్టు , క్యాజువాలిటి లో ముగ్గురు పర్మనెంట్ డాక్టర్లు నియమించుట కు కృష్ణ జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కు బి.సి సంక్షేమ సంఘ అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రి లో 200మంది స్టాఫ్ నర్సు అవసరం అవ్వగా 130 వరకే ఉన్నారు. మిగతా 70పోస్టులు నియ మించుట వలన పేద- మధ్య తరగతి రోగులకు వైద్యం అందుతుంది. స్టాఫ్ నర్సులు తక్కువ ఉండుట వలన ఒక వార్డు డ్యూటీకి బదులుగా రెండు, మూడు వార్డులు డ్యూటీకు నియమిస్తు న్నారు, కావున సకాలంలో రోగులకు వైద్యం అందడం లేదు పేద మధ్య తరగతి రోగులకు సరైన వైద్యం కొరకు ఇంకా 70 స్టాప్ నర్సులు పోస్టు నియమించాలి అలాగే క్యాజువాలిటీలో ముగ్గురు డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటం వలన తాత్కాలిక డాక్టర్లతో వైద్యం చేస్తున్నారు, క్యాజువాలిటీ లో ముగ్గురు డాక్టర్ పోస్టులను నియమించాలి. ఈ సమస్యలన్నింటినీ జాయింట్ కలెక్టర్ విన్నవించగా వారు సానుకూలంగా స్పందించినట్లు సుబ్రమణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో భోగి రెడ్డి సుభాని పెద్ది బోయిన సాంబయ్య ఎం పవన్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో అబాకస్ వేదగణితం పోటీలు






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి అబాకస్, వేదగణితం పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో 14 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు . మచిలీపట్నం గొడుగు పేటకు చెందిన శిక్షకురాలు సామా దేవి విద్యార్థులు ప్రతిభను కనపరిచి బహుమతులను అందుకున్నారు. అందులో భాగంగా జూనియర్ విభాగంలో ఎస్ శాన్వి, కే ఆరుషి, సిహెచ్ నిహాల్ కార్తికేయ, బి కృష్ణ, సీనియర్ విభాగంలో పి నిత్య, టి.శ్రీరామ్, హిమేష్, బి గురు కార్తికేయ, నిర్మల హై స్కూల్ విద్యార్థినీలు స్ఫూర్తి రేచల్, సుసన్నలు స్కూలు విభాగంలో బహుమతులు అందుకున్నారు .ఇస్రో సైంటిస్ట్ పి ఏడుకొండలు చేతుల మీద గా బహుమతుల ప్రధానం చేశారు. రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ పద్మలత ,రంగారావు లు అబాకస్, వేదగణితం గురించి పిల్లలలో మంచి అవగాహన కల్పించారు.

# అక్కడేం జరిగింది..?

అక్కడ యాపిల్ నెత్తురు చుక్క య్యింది.
తరతరాల నుండి చల్లని కొండల్లో గుత్తులు గుత్తులుగా కాసిన కాయలు, నేడు బిక్కు బిక్కు మంటూ కళ్ళల్లో వత్తులేసుకొని నెత్తురు ముఖం పెట్టుకున్నాయి.
కాళిదాసు మహోన్నతంగా కీర్తించిన సరస్వతి పీఠం,
బీటలు వారిన శిథిలాల మధ్య చిక్కుకోవడం విడ్డూరం.
సోన్మార్గ్, గుల్మార్గ్, పహాల్గాం లాంటి పట్టణ పక్షులు ప్రేమ గీతాలు పాడుతూ పరవశించే మధుర స్వప్నాలు లేవక్కడ.
బిడ్డలు కడుపు లో ఉండగానే
కమ్మగా ఆస్వాదించే కుంకుమ పువ్వు పేలుళ్ల శబ్దాలకు ఉలిక్కి పడి భయం తో బాధపడుతుంది.
చల్లని గాలులతో, జిల్లుమనే నీటితో, ఎత్తయిన వృక్షాలతో,
నిటారుగా నిలబడిన కాశ్మీరం
జీహాద్ మోహపుముసుగుకు
చిక్కుకొని విల విలలాడుతుంది.
ఊచ కోతలతో ఊపిరాడక బలిష్టమైన సరస్వతి సామ్రాజ్యం
వదులుకున్న పండిట్ల కన్నీరు కాలువలు కట్టింది ఇక్కడ.
జాబిల్లి లాంటి భూమి, జాజి పూల వంటి జీవితం ఉగ్రవాద దాష్టిక జ్వాలలతో ఎరుపెక్కింది.
ఏ చక్కని మానవత్వం ఇక్కడుంది.
ఏ ఏకతా రూపం ఇక్కడ పురుడుపోసుకోవాలి.
ఏ బాంధవ్యం అందరినీ కలిపే ప్రయత్నం చేస్తోంది.
చూడాలి మరి......?

**గాదంశెట్టి శ్రీనివాసులు**
**ఉప్పు గుండూరు, ప్రకాశం జిల్లా**

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com